

టీటీడీ ఉద్యోగిగా.. : 1978లో టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టులో గాయకుడిగా చేరిన గరిమెళ్ల 2006 వరకు సేవలందించారు. అన్నమాచార్య సంకీర్తనల స్వర కల్పన.. సంగీత స్వరాలతో కూడిన పుస్తకాల ముద్రణ.. రికార్డింగ్‌లో పాలుపంచుకున్నారు. ఈ ప్రాజెక్టు అదనంగా గరిమెళ్ల సంగీత పాండిత్యాన్నీ వెలుగులోకి తెచ్చింది. 2012 నుంచీ 2023 వరకూ టీటీడీ ఆస్థాన విద్వాంసుడిగా గౌరవానికి నోచుకున్నారాయన.

వినరో భాగ్యము

..అంటూ వినువీధుల్లోకి

● మూగబోయిన గరిమెళ్ల మధురగళం

'వినరో భాగ్యము విష్ణు కథ..' అంటూ వేంకటపతి చరిత చెప్పిన స్వరం వైకుంఠం చేరింది.
'దాచుకో నీపాదాలకు దగనే జేసిన పూజలివి.. అంటూ శ్రీనివాసుడిని ఆర్తితో అర్చించిన గానం సప్తగిరులను ఆవహించింది.
టీటీడీ ఆస్థాన విద్వాంసుడు, మధుర గాయకుడు, అద్భుత స్వరకర్త గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్(76) ఆదివారం సాయంత్రం తిరుపతిలో గుండెపోటుతో కన్నుమూశారు. బుధవారం ఆయనకు అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఆయన లేకున్నా.. ఆయన కీర్తనలు మాత్రం తెలుగు గడ్డపై వినిపిస్తూనే ఉంటాయని ప్రముఖులు నివాళులర్పించారు.









సంగీతానికి అంకితమైన పుంభావ సరస్వతిగా పేరు తెచ్చుకున్న గరిమెళ్ల 1948 నవంబరు 9న రాజమహేంద్రవరంలో జన్మించారు. ప్రఖ్యాత నేపథ్య గాయని ఎస్.జానకి ఆయనకు స్వయానా పిన్ని. నేదునూరి, పశుపతి, మంగళంపల్లి వీరికి గురువులైనప్పటికీ గరిమెళ్ల బాణీ.. ఈ ముగ్గురు త్రిమూర్తుల మేలు కలయిక అని సంగీతప్రియులు చెప్పుకుంటుంటారు. నేదునూరి వారిలోని రాగభావం, పశుపతి గాత్రంలోని శ్రుతిశుద్ధం, బాలమురళి వాణిలోని లాలిత్యం కలబోసిన బాణి ఆయనది.

స్వరాలతో నవ్యశోధన : అన్నమయ్య చేసిన పదార్చనకు గరిమెళ్ల రాగాలు బంగారానికి తావి అనిపిస్తాయి. 150కి పైగా రాగాలను తీసుకొని, వెయ్యికుపైగా సంకీర్తనలకు వైవిధ్యభరితంగా బాణీలు కట్టిన ఘనత గరిమెళ్లది.
ఆయన స్వరపరచిన అన్నమయ్య సంకీర్తన వింటుంటే, సాహిత్యం, దానికి తగ్గ సంగీతం జతగా కలసి మెలసి అన్నమయ్య మనతో మాటాడుతున్నారా అనిపిస్తుందంటే అతిశయోక్తి లేదు.

మోహన, హిందోళ, శుద్ధధన్యాసి వంటి రాగాలలో సాధారణంగా ఎవరు స్వరపరచినా పరిమితమైన అవే సంగతులు కనబడతాయి. కానీ గరిమెళ్ల ఒకదానికొకటి భిన్నమైన స్వరప్రయోగాలతో, సాహిత్యంలో ఒదిగిపోయే విధంగా స్వరం సమకూర్చటం విశేషం. ఔడవ (5 స్వరాల) రాగాలలోనే ఆయన అధిక భాగం స్వరపరిచారు. ఇక, ఆయన సృష్టించిన రాగాల విషయానికొస్తే సుందరరంజని, వాణీప్రియ, చిత్ర కల్యాణి వంటి రెండుపదుల రాగాలను, వినూత్న భావావిష్కరణలకు ఆలవాలమయేట్లు ఆయన సృజించారు. ఇది ఆయన మరో నవ్య శోధన.

సంకీర్తన యజ్ఞ ప్రక్రియకు ఆద్యుడు

సంకీర్తన యజ్ఞ ప్రక్రియకు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్‌ను ఆద్యుడిగా పరిగణిస్తారు. ఓ గాయకుడు ఒకే రోజు ఒకే వేదికపై అనేక కీర్తనలు ఆలపించడాన్ని సంకీర్తన యజ్ఞంగా పిలుస్తారు. 1997లో విశాఖలోను, 1999లో విజయవాడలోనూ ఆయన ఈ తరహా కార్యక్రమాలు నిర్వహించి 200కు పైగా కీర్తనలు ఆలపించారు. 2001లో తిరుపతిలో 300 కీర్తనలు పాడారు. 2003, 2007లలో హైదరాబాదులోనూ, 2008లో విజయవాడలోనూ, 2009లో హైదరాబాదులో, 2011లో కాకినాడలో, 2012లో తిరుపతిలో యజ్ఞ ప్రక్రియ కార్యక్రమాలు నిర్వహించి ఆయాచోట్ల 200కు పైగా కీర్తనలు ఆలపించారు.



భర్త భౌతికకాయం వద్ద విలపిస్తున్న రాధ

కొండపై ఏమూల ఉన్నా.. ఆయన గానం చెవిన పడాల్సిందే

గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ కీర్తి కిరీటంలో మరో కలికితురాయి బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ శివపదు కీర్తనలను స్వరపరచి ఆలపించడం కూడా. దాదాపుగా 150 శివపద కీర్తనలను స్వరపరచి ఆలపించారు. అవి నిజంగా ఆణిముత్యాలే. మధుర భావ తరంగాలే. ఆయన స్వరసహితంగా వెలువరించిన స్వీయ రచిత ఆంజనేయ కృతిమణిమాల, వినాయక కృతులు, నవ గ్రహ కృతులు,"సర్వదేవతా స్తుతి రచనలు. ఇలా అనేకం బహుళ జనాదరణ పొందాయి. గరిమెళ్ళవారి గళం వినబడని ఆకాశవాణికేంద్రం లేదు. భక్తిరంజని కార్యక్రమం లేదు. దేశమంతటా పర్యటించి 'అన్నమయ్య నాదయజ్ఞాలు' ఎన్నో విజయవంతంగా నిర్వహించారు. ఆయన పలుకు ఎంత మంద్రమో గానమంత మార్దవం. అనవసర విన్యాసాలకు, ఆడంబర విద్వత్వ ప్రదర్శనలకు ఆయన దూరంగా ఉంటారు. తిరుమలకొండపై ఏమూల ఉన్నా, ఏ చోటనున్నా, గాలిఅలలపై తేలివచ్చే గరిమెళ్ళవారి గళం చెవికి సోకగానే, మధురానంద భరితుడవటం తథ్యం.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



గరిమెళ్ల భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, సీపీఆర్వో రవి తదితరులు

గరిమెళ్లకు అనేక పురస్కారాలు

సంప్రదాయ కర్ణాటక సంగీతంలో విద్వాంసుడిగా పేరు మోసిన గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్‌ను పలు ప్రైవేటు, ప్రభుత్వ, ఆధ్యాత్మిక సంస్థలు పురస్కారాలతో గౌరవించాయి. ఆయనకు దక్కిన వాటిలో 2020లోని కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారం ముఖ్యమైనది. ఆయన అసాధారణ సేవలను గుర్తించి టీటీడీ వెండి పతకం, ప్రశంసా పత్రంతో సత్కరించింది. 2001లో టీటీడీ, లలిత కళా అకాడమీలు సంయుక్తంగా పురస్కారం ప్రదానం చేయగా 2007లో ఏపీ ప్రభుత్వం ఉగాది పురస్కారం ప్రకటించింది. 2009లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం మ్యుజీషియన్ ఆఫ్ ది ఇయర్ విశిష్ట పురస్కారం.. 2010లో చెన్నైకి చెందిన రాజ్యలక్ష్మి ఫౌండేషన్ పురస్కారం ప్రకటించాయి.

గాయని, పిన్ని అయిన ఎస్.జానకితో బాలకృష్ణ ప్రసాద్



మీకేం కావాలి?

ఐటీ ఉద్యోగుల వివరాలు సేకరిస్తున్న ప్రభుత్వం

కొత్తగా ఉద్యోగం చేయాలనుకుంటున్న వారి ఆసక్తినీ తెలుసుకుంటోంది

వర్క్ ఫ్రం హోమ్ చేస్తున్నారా..? మీకున్న సమస్యలేంటి? ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం కావాలి? అంటూ ఐటీ ఉద్యోగుల వివరాలను సచివాలయ ఉద్యోగులు సేకరిస్తున్నారు. అలాగే కొత్తగా ఉద్యోగం చేయాలనుకుంటున్న వారి వివరాలూ నమోదు చేస్తున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో గత నెల 27వ తేదీనుంచి ఈ సర్వే జరుగుతోంది. సోమవారంలోగా ఈ సర్వే పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఆపై కార్యాచరణ రూపొందించనుంది.



ఐటీ ఉద్యోగుల కుటుంబాలు జిల్లాలో 4,54,152 ఉన్నాయి. వీరిలో 18-50 ఏళ్ల మధ్య వయసున్నవారు 10,05,314 మంది ఉన్నారు. ప్రాంతాలవారీగా.. చిత్తూరులో 44,106, వి.కోటలో 22,235, కుప్పంలో 18,725, పుంగనూరు అర్బన్‌లో 13,895, పుంగనూరు రూరల్‌లో 13,408, ఐరాలలో 11,603, సోమలలో 10,146, చౌడేపల్లెలో 10,757, పూతలపట్టులో 10,126, పలమనేరులో 13,041, శాంతిపురంలో 15,368, యాదమరిలో 11,186, పెద్దపంజాణిలో 14,216, బంగారుపాళ్యంలో 17,556, తవణంపల్లెలో 12,371, గుడిపాలలో 10,273, గంగవరంలో 14,081, కార్వేటినగరంలో 10,849, వెదురుకుప్పంలో 10,920, నగరిలో 14,198, బైరెడ్డిపల్లెలో 14,493, కుప్పంలో 18,725, గుడుపల్లెలో 11,728, గంగాధరనెల్లూరులో 16,686, రామకుప్పంలో 15,061 ఉండగా, మిగిలిన మండలాల్లో పదివేలకు లోపు కుటుంబాలు ఉన్నాయి.

పనిచేయడానికి ఆసక్తి ఉంటే..

తగిన విద్యార్హత ఉన్నవారు ఐటీ, ఐటీఈఎస్ (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎనేబుల్డ్ సర్వీసెస్), ఇతర అనుబంధ సంస్థల్లో పనిచేయడానికి ఆసక్తిగా ఉన్నారా అనేది కూడా ఈ సర్వే ద్వారా తెలుసుకుంటున్నారు. సర్వే పూర్తయ్యాక వివిధ ఐటీ సంస్థలను ప్రభుత్వం సంప్రదించనుంది.

సెంటరు ఏర్పాటు

ఒకే ప్రాంతంలో ఎక్కువమంది ఉంటే..అక్కడ ఒక సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. వీటిలో 20 నుంచి 25 మంది పనిచేసేలా వసతులు కల్పించనుంది.

- చిత్తూరు కలెక్టరేట్, ఆంధ్రజ్యోతి

సెలవు రోజుల్లోనూ రిజిస్ట్రేషన్లు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఈనెలాఖరు వరకు సెలవు రోజుల్లోనూ పని చేస్తాయని అధికారులు తెలిపారు. రాష్ట్ర కమిషనర్ హరినారాయణన్ ఆదేశాలతో ఆదివారం, ప్రభుత్వ సెలవు దినాల్లో కార్యాలయాలు పనిచేస్తాయి. కాగా, నిబంధనల మేరకు సెలవు రోజుల్లో రిజిస్ట్రేషన్లు చేయడానికి అదనంగా నిర్ణీత రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఈ అవకాశాన్ని భూ క్రయ, విక్రయదారులు సద్వినియోగం చేసుకోవాలని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు కోరారు.

నేడు 'పీజీఆర్ఎస్'

చితూరు అర్బన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామని తెలిపారు. అలాగే ఆయా మండల, నియోజకవర్గాల్లో పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

జిల్లా పోలీసు కార్యాలయంలోనూ..

జిల్లా పోలీసు కార్యాలయంలోనూ సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బాధితుల నుంచి వినతిపత్రాలను స్వీకరించి, సమస్యలకు పరిష్కారం చూపుతామని తెలిపారు.

భానుడి భగభగలు

● జిల్లాలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు



ఎండల కారణంగా బోసిపోయిన చిత్తూరులోని గాంధీ సర్కిల్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉష్ణోగ్రతలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. ఉదయం పూట కొంత చలి ఉన్నప్పటికీ.. ఏడు గంటల నుంచే ఎండ తీవ్రత అధికంగా ఉంటోంది. సాయంత్రం ఐదు గంటల వరకు కొనసాగుతోంది. ఆదివారం గుడిపాల మండలంలో 37.8 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. మండలాలవారీగా.. తవణంపల్లెలో 37.2, ఎస్ఆర్‌పురంలో 36.7, నగరిలో 36.6, పులిచెర్లలో 36.2, గుడుపల్లె, శాంతిపురంలో 35.6, ఐరాలలో 35.3, నింద్రలో 35.2, చిత్తూరులో 35, సోమలలో 34.5, చౌడేపల్లె, పాలసముద్రం, రొంపిచెర్ల, విజయపురంలో 34.4, గంగవరం, వి.కోటలో 34, పూతలపట్టు, వెదురుకుప్పంలో 33.9, కుప్పంలో 33.7, జీడీ నెల్లూరులో 33.5, సదుం, పెద్దపంజాణిలో 33.4, పెనుమూరులో 32.9, కార్వేటినగరంలో 32.8, యాదమరిలో 32.7, పుంగనూరు, రామకుప్పంలో 32.6, పలమనేరులో 32.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

ఒంటరి ఏనుగు దాడిలో యువకుడికి గాయాలు



చికిత్స పొందుతున్న ఉమాపతి

యాదమరి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఒంటరి ఏనుగు దాడిలో ఓ యువకుడికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. యాదమరి మండల పరిధిలో దళవాయిపల్లెకు చెందిన మణి కుమారుడు ఉమాపతి(25), వంశీకృష్ణ అనే యువకులు ఆదివారం రాత్రి గ్రామ సమీపంలోని పొలంలో ఉన్న పశువుల పాక వద్దకు ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. అటవీ ప్రాంతంలోకి వెళ్లగానే చీకటిలో ఒంటరి ఏనుగు తొండంతో దాడి చేసింది. దీంతో ఉమాపతి కిందపడగా, ఆ ఏనుగు తొక్కడంతో గాయాలయ్యాయి. వంశీకృష్ణ తప్పించుకున్నాడు. ఈ విషయాన్ని కుటుంబీకులు, గ్రామస్తుల సహకారంతో అటవీశాఖ సిబ్బందికి తెలియజేశారు. బోడబండ్ల బీట్ ఎఫ్‌బీవో ప్రతాప్, సిబ్బంది, గ్రామస్తులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. గాయపడ్డ ఉమాపతికి యాదమరి పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స చేయించాక చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. కొంతకాలంగా 14 ఏనుగుల గుంపు బంగారుపాళ్యం, యాదమరి మండలాల పరిధిలో సంచరిస్తూ పొలాలపై దాడులు చేస్తున్నాయి. ఈ గుంపు నుంచి విడిపోయిన ఏనుగు ఈ దాడిచేసి ఉంటుందని అధికారులు అంచనాకు వచ్చారు.



నెమళ్లకు చికిత్స చేస్తున్న పశువైద్యులు

పొలాల్లో స్పృహ కోల్పోయిన నెమళ్లు

- పంటలకు పిచికారీ చేసిన మందులే కారణమన్న పశువైద్యులు -

పుంగనూరు రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పంటలకు పిచికారీ చేసిన మందుల కారణంగా రెండు నెమళ్లు పొలాల్లో స్పృహ కోల్పోయాయి. పుంగనూరు మండలంలోని రాగానిపల్లె పంచాయతీ చెర్లోపల్లె సమీపంలోని ఓ రైతు పొలం వద్ద రెండు నెమళ్లు పడి ఉన్నాయి. గుర్తించిన పక్క పొలం రైతు అశోక్ వెంటనే చంద్రమాకులపల్లె అటవీశాఖ బీట్ అధికారి కిషోర్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన సంఘటన స్థలానికి చేరుకుని స్పృహ కోల్పోయి ఉన్న పక్షులను పుంగనూరు ప్రభుత్వ పశువైద్యశాలకు తరలించి, చికిత్సలు అందించారు. పంటలకు చీడపురుగుల మందు పిచికారీ చేయడం వల్ల వాటి నుంచి కిందపడ్డ పురుగులు, కాయలు తినడంతో పక్షుల ఆరోగ్యం దెబ్బతిన్నట్లు పశువైద్యులు తెలిపారని కిషోర్ తెలిపారు. రెండ్రోజులపాటు చికిత్స అందించాక అటవీప్రాంతంలో వదిలేస్తామని చెప్పారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సోమవారం) : 6.28

సహరి (మంగళవారం) : 5.04

సచివాలయ సేవలు విస్తృతం

● క్లస్టర్లవారీగా విభజన

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సేవలను మరింత చేరువ చేసేందుకు కూటమి ప్రభుత్వం హేతుబద్ధీకరణకు నిర్ణయించింది. దీనిలో భాగంగా సచివాలయాలను క్లస్టర్లుగా విభజించనున్నారు. సంబంధిత విధి విధానాలు తయారు చేయాలని సచివాలయ పాలన విభాగానికి, మండల పరిషత్‌లకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దాంతో జిల్లా యంత్రాంగం కసరత్తు ప్రారంభించి.. ఈనెల 15వ తేదీలోగా పూర్తి చేసేందుకు సిద్ధమైంది.

విభాగాలుగా సిబ్బంది

గ్రామ సచివాలయాల్లో 11 మంది, పట్టణాల్లో 9 మంది చొప్పున సిబ్బంది ఉంటారు. ప్రస్తుతం వీరిని పలు విభాగాలుగా విభజించనున్నారు.

బహుళార్థక..

ఈ విభాగంలో నాలుగు కేటగిరీల ఉద్యోగులైన పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు ఉంటారు. వీరు సర్వేలు చేపడతారు. ఇతర సేవలు క్లస్టర్ స్థాయిలో అందిస్తారు.

సాంకేతిక..

వ్యవసాయ, సెరికల్చర్, ఉద్యాన, ఇంజనీరింగ్, ఆరోగ్య, పశు సంవర్ధక, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, విద్యుత్ సహాయకులు ఉంటారు.

ఇన్ఫర్మేషన్..

ఈ విభాగంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో ప్రవేశమున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఉద్యోగులను గుర్తించి ఈ విభాగంలో చేర్చనున్నారు. వీరిని ఐటీ అవసరాలకు వినియోగించనున్నారు.

రెవెన్యూ..

ఈ విభాగంలో వీఆర్వోలు, సర్వేయర్లు ఉంటారు. కాగా మహిళా పోలీసులను ఐసీడీఎస్, పోలీసు స్టేషన్లలో నియమిస్తారు. కాగా, వీరిలో పలువురు పోలీసుస్టేషన్లలో విధులు నిర్వహించడానికి విముఖత చూపుతున్నారు.

ఎంపీడీవోల ఆధ్వర్యంలో..

ప్రతి మండలంలో పక్కపక్కన ఉన్న సచివాలయాలను క్లస్టర్లుగా పరిగణిస్తారు. సచివాలయాలు సరిసంఖ్యలో ఉంటే సగం క్లస్టర్లు ఏర్పాటు అవుతాయి. ఉదాహరణకు 12 సచివాలయాలుంటే ప్రతి క్లస్టర్‌లో ఆరేసి సచివాలయాలను ఏర్పాటు చేస్తారు. బేసి సంఖ్యలో ఉంటే ఒక క్లస్టర్ పరిధిలోకి రెండు సచివాలయాలను తీసుకొస్తారు. బహుళార్థక విభాగంలో జనాభా ప్రాతిపదికన, సాంకేతిక విభాగంలో క్లస్టరు పరిధిలో ఉద్యోగులను గుర్తిస్తారు. వీరు రెండేసి సచివాలయాల్లో పనిచేయాల్సి ఉంది. క్లస్టర్ల విభజన చర్యలను ఎంపీడీవోలు చేపడతారు.

సంగ్రహంగా..

జిల్లాలో

సచివాలయాలు: 612

ప్రతిపాదిత క్లస్టర్లు: 310

ఉద్యోగులు: 4432

పంటలపై గజరాజుల దాడి



ఏనుగులు తొక్కేసిన వరి పంట

బంగారుపాళ్యం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం మండలంలోని పులిమడుగు గ్రామంలో శనివారం రాత్రి ఏనుగుల గుంపు పంటలపై దాడి చేసింది. వరి, రాగి, అరటి, బొప్పాయి పంటలను తొక్కి.. నాశనం చేశాయని గ్రామానికి చెందిన ధనలక్ష్మి, వేలు, పెరిస్వామి, చంద్రబాబు, శ్రీను, జయశంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోకి వచ్చిన ఏనుగుల గుంపును గ్రామస్తులు, యువకులు కలిసి డప్పులు, టపాకాయలు పేలుస్తూ అటవీ ప్రాంతానికి తరిమినట్లు వారు చెప్పారు. ఈ విషయాన్ని అటవీ శాఖాధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఏనుగుల దాడుల నుంచి పంటలను కాపాడాలని వేడుకుంటున్నారు.

మహిళ అదృశ్యం



ఉన్నామలై

నగరి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నగరి పట్టణ పరిధిలోని పెరుమాళ్ గుడి వీధికి చెందిన ఉన్నామలై(52) అనే మహిళ అదృశ్యమైంది. ఈ నెల 2వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగిరాలేదు. బంధువులు, తెలిసినవారి వద్ద వారం రోజుల పాటు ఆరా తీసినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె కుమారుడు దండపాణి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 80997 18633 నెంబరును సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

జీఎస్‌టీ ఆఫీసు సబార్డినేట్ రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక



శ్రీనివాసరావు, చెన్నకేశవులు

తిరుపతి (నేరవిభాగం), మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సేల్స్ ట్యాక్స్ ఆఫీసు సబార్డినేట్ల సంఘం (జీఎస్‌టీ) రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని తిరుపతి జీఎస్‌టీ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు ఇటీవల రాష్ట్ర అధ్యక్ష పదవికి గోపాలకృష్ణ రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో నూతనంగా ఆర్. శ్రీనివాసరావును(విజయవాడ) కమిటీ సభ్యులు ఎన్నుకున్నారు. వీరితో పాటు చెన్నకేశవవులు(గుంటూరు) ప్రధాన కార్యదర్శిగా, ఆర్.సత్యనారాయణను కార్యాలయ కార్యదర్శిగా, జగన్నాధంను కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు మొత్తం 11 మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఈ క్రమంలో ముందుగా నూతన కమిటీ కోసం ఎన్నికలు నిర్వహించాలని భావించినా ఆఖరి నిమిషంలో సభ్యులందరూ కలసి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రభుత్వం నుంచి ఆఫీసు సబార్డినేట్ సిబ్బందికి రావాల్సిన సౌకర్యాలు, ఇతర ప్రయోజనాలపై ప్రభుత్వంతో చర్చించి న్యాయమైన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 13 ఉమ్మడి జిల్లాల నుంచి దాదాపు 100 మంది సభ్యులు పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్‌కు 'పది' ప్రశ్నపత్రాలు



సోమల పోలీసు స్టేషన్‌కు చేరుకున్న పదో తరగతి ప్రశ్న పత్రాలు

సోమల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ప్రశ్నపత్రాలు ఆదివారం సోమల పోలీసుస్టేషన్‌కు చేరుకున్నాయి. ఎంఈవో కేశవరెడ్డి వాటిని ప్రత్యేక బాక్సుల్లో పోలీసు బందోబస్తుతో గదిలో భద్రపరిచారు. సోమల మండలంలో సోమల, కందూరు, పెద్దఉప్పరపల్లె హైస్కూల్‌ల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. నంజంపేట హైస్కూల్ విద్యార్థులు పెద్దఉప్పరపల్లెలో, సూరయ్యగారిపల్లె హైస్కూల్ విద్యార్థులు సోమల హైస్కూల్‌లోని పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నారు.

ముక్కంటి సేవలో వాసుకి నందన్



శ్రీకాళహస్తి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని ఆదివారం ప్రముఖ సినీనటి వాసుకి నందన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆమెకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

కాలినడక భక్తులకు ఉపశమనం

- అలిపిరి మార్గంలో తాత్కాలిక పైకప్పు ఏర్పాటు



తిరుమల, మార్చి 9(ఆంధ్రజ్యోతి): అలిపిరి మార్గంలో నడక భక్తులకు వేసవి నుంచి ఉపశమనం కలిగింది. టీటీడీ తాత్కాలిక పైకప్పును ఏర్పాటు చేసింది. శ్రీవారి భక్తుల్లో 30 నుంచి 40 శాతం మంది ఈ మార్గంలోనే వస్తుంటారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి మోకాలిమిట్ట వరకు దాదాపు 1.6 కిలోమీటర్ల మేర మొదటి ఘాట్ రోడ్డు వెంబడే నడవాలి. కాలినడక మొక్కుకావడంతో పాదరక్షలు లేకుండానే భక్తులు వస్తుంటారు. దాదాపు కిలోమీటరు వరకు శాశ్వత షెడ్డు ఉన్నప్పటికీ మరో 600 మీటర్ల మేర ఎండకు కాలుతున్న రోడ్డుపైనే నడవాల్సి వస్తుంది. ఈ క్రమంలో టీటీడీ ఇంజినీరింగ్ విభాగం జర్మన్ షీట్లతో తాత్కాలిక పైకప్పును ఏర్పాటు చేసింది. దీంతో భక్తులకు వేసవి నుంచి కాస్త ఊరట లభిస్తోంది.

అమ్మవారి సేవలో కేంద్రమంత్రి ఎస్పీసింగ్ బఘేల్



ఆలయం వద్ద కేంద్రమంత్రి ఎస్పీసింగ్ బఘేల్

తిరుచానూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో కొలువై ఉన్న శ్రీపద్మావతి అమ్మవారిని ఆదివారం కేంద్ర మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. మొదట ధ్వజస్తంభానికి అనంతరం సన్నిధిలో అమ్మవారి మూలవర్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం కేంద్రమంత్రిని వేదపండితులు ఆశీర్వదించి అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు.

టమోటా సాగుకు కూలీల కొరత

- ఇబ్బంది పడుతున్న రైతులు



సోమలలో మల్చింగ్ షీట్ వేసి సాగు చేసిన టమోటా పంట

సోమల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ధర ఉన్నా లేకున్నా టమోటా పంట సాగుపై రైతులు ఆసక్తి చూపుతూనే ఉన్నారు. ఆధునిక పద్ధతులనూ అవలంబిస్తున్నారు. కొద్దిగా భూమి ఉన్నా టమోటా సాగు చేయడం పడమటి మండలాల్లో పరిపాటిగా మారింది. దీంతో కూలీల కూడా డిమాండ్ పెరిగింది. ప్రధానంగా మల్చింగ్ షీట్‌ను పరచడానికి కూడా కూలీలు దొరకడం లేదు. మల్చింగ్ షీట్ వాడటం వల్ల నీటి ఆదాతోపాటు తెగుళ్లను, కలుపును నివారించవచ్చు. పంట దిగుబడీ పెరుగుతుండటంతో ఎక్కువ మంది రైతులు దీనిపై మొగ్గు చూపుతున్నారు.

ఎకరాకు ఖర్చులు ఇలా..

దుక్కులయ్యాక ఎకరా పొలానికి 6000 - 7000 మీటర్లు నిడివిగల మల్చింగ్ షీట్‌ను వాడుతున్నారు. దీన్ని పరచడానికి కూలీ ఖర్చు రూ.12 వేలకు మించి పోతుంది. ఇంత వెచ్చిస్తున్నా కూలీలు దొరకడం గగనమవుతోంది. ఇక మల్చింగ్ షీట్ కట్ట 400మీటర్ల ధర రూ.2450 పలుకుతోంది. ఎకరాకు 6, 7 కట్టల కోసం రూ.17వేల వరకు వ్యయం చేస్తున్నారు. ప్రభుత్వం ఉద్యానశాఖ ద్వారా మల్చింగ్ షీట్లను రాయితీలో అందజేయాలని రైతులు కోరుతున్నారు. ఇతర ఖర్చులు కలుపుకుంటే ఎకరా సాగుకు రూ.1.50 లక్షలు దాటుతోంది. ఇవన్నీ భరించలేని కొందరు రైతులు తమ భూములు లీజుకు ఇచ్చేస్తున్నారు.

సాగు ఇలా..

సోమల మండలంలోని కరకమంద, ఇరికిపెంట, నెల్లిమంద, కందూరు, సోమల, పెద్దఉప్పరపల్లె, తమ్మినాయనపల్లె పంచాయతీల్లో జనవరి, ఫిబ్రవరి నెలల్లో 600 ఎకరాలకు మించి టమోటా సాగు చేశారు. మలి విడతగా ఈనెలలో మరో 600 ఎకరాలకు మించి సాగుచేయడం జరుగుతుంది.

లాటరీ పంటే



టమోటా లాటరీ పంటే. జనవరిలో ఎకరా సాగు చేశాను. ఈనెలలోనూ పొలం సిద్ధం చేస్తున్నా. కూలీల ఇబ్బందులు తప్పడం లేదు. ప్రస్తుతం 15కిలోల బాక్సు రూ.150 లోపే ఉంది. ఈ ధరలు ఇలాగే కొనసాగితే నష్టాలే వస్తాయి.

- ఎస్. నాగరాజ, సోమల

ఏటా 10-20 ఎకరాల్లో సాగు



ఏటా 10-20 ఎకరాల్లో సాగు చేస్తున్నా. గత ఏడాది సీజన్‌లో పంట చేతికొచ్చే సమయంలో కిలో రూ.130-250 వరకు ధర పలికింది. గతంలో అధిక లాభాలు వచ్చాయి. ప్రస్తుతం సాగుకు కూలీల కొరత తీవ్రంగా ఉంది.

- పి.మురళి, కరకమంద

లీజుకిచ్చేశా



కూలీల కొరతతో ఇబ్బందులు పడ్డాను. ఇప్పుడు రెండెకరాలను రూ.80 వేలకు లీజుకు ఇచ్చాను. సోమలలో వ్యవసాయ మార్కెట్‌లో పనులు పూర్తి చేశారు. ఈఏడాది నుంచి మామిడి, టమోటాలు కొనేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

- టి.సోమశేఖర్, సోమల

మద్యం మత్తులో బాబాయి, అబ్బాయి ఘర్షణ

- రోకలితో తలపై మోదడంతో అబ్బాయి మృతి

పుత్తూరు అర్బన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో జరిగిన చిన్నపాటి గొడవ హత్యకు దారితీసింది. ఈ ఘటన ఆదివారం మధ్యాహ్నం పుత్తూరు పరిధిలోని చినరాజుకుప్పంలో జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. అన్నదమ్ములైన సుబ్బరాయుడు, వెంకటేష్ పక్కపక్క ఇళ్లలోనే ఉంటున్నారు. సుబ్బరాయుడి కుమారుడు మణికంఠ తిరుపతిలోని ఓ బార్‌లో పని చేస్తున్నాడు. ఆదివారం కావడంతో చిన్నాన్నతో కలిసి ఆయన ఇంట్లోనే మద్యం తాగారు. ఆ మత్తులో గొడవపడ్డారు. ఈ ఘర్షణలో వెంకటేష్ రోకలితో మణికంఠ తలపై బలంగా మోదాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో ఘటనా స్థలంలోనే మణికంఠ అపస్మారకస్థితికి చేరుకున్నాడు. ఎంతకీ కొడుకు రాకపోవడంతో అతడి తల్లి పక్కనే ఉన్న ఇంటికెళ్లి వెళ్లికి చూసింది. వెంకటేష్ మద్యం మత్తులో తూలుతుండగా, కొడుకు ఉలుకూపలుకూ లేకుండా రక్తంలో పడి ఉండడంతో గ్రామస్తుల సాయంతో 108 అంబులెన్స్‌కు సమాచారం అందించింది. సంఘటనా స్థలానికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది మణికంఠను పరీక్షించి మృతి చెందినట్టు ధృవీకరించారు. మణికంఠపై దాడికి గల కారణాలు తెలియాల్సి ఉంది. మణికంఠకు భార్య జనని, రెండేళ్ల కొడుకు ఉన్నాడు. ప్రస్తుతం ఆమె గర్భిణి. వయసు మీరిన తల్లిదండ్రులకు, కుటుంబానికి మణికంఠ సంపాదనే ఆధారం. తన భర్త మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి వద్ద జనని భోరున విలపించింది. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు వెంకటేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మణికంఠ (ఫైల్ ఫొటో)

బోయకొండ గంగమ్మకు పంచామృతాభిషేకాలు




ప్రత్యేకాలంకారంలో గంగమ్మ

చౌడేపల్లె, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శక్తి క్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ఉదయాన్నే ఆలయ వేదపండితులు అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని స్వర్ణాభరణాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలే కాకుండా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో, డిప్యూటీ కమిషనర్ ఏకాంబరం ఏర్పాట్లను పర్యవేక్షించారు.



అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో భక్తులు

తెప్పపై శ్రీరామచంద్రమూర్తి



తిరుమలలో ఆదివారం సాయంత్రం శ్రీవారి తెప్పోత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు.. సీతాలక్ష్మణ ఆంజనేయస్వామి సమేత శ్రీరామచంద్రమూర్తి ఉత్సవర్లను మాడవీధుల ఊరేగింపుగా తీసుకొచ్చి పుష్కరిణిలోని తెప్పపై ఆశీనులను చేశారు. మూడుచుట్లు విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. - తిరుమల, ఆంధ్రజ్యోతి

బైక్‌ను ఢీకొన్న లారీ : యువకుడి దుర్మరణం



అంకయ్య (ఫైల్‌ఫొటో)

చిట్టమూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గున్నాగుంట రోడ్డు మలుపు వద్ద ఆదివారం సాయంత్రం మోటర్ బైక్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలో బందిల అంకయ్య(22) దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం మేరకు... వాకాడు మండలం గొల్లపాళెం గ్రామానికి చెందిన కిష్టయ్య, శ్యామల దంపతుల కుమారుడు అంకయ్య నాయుడుపేట నుంచి మోటర్ బైక్‌పై ఇంటికి వెళ్తుండగా లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో అంకయ్య తల పగిలిపోయి అక్కడి కక్కడే మృతి చెందాడు. అంకయ్య మోటర్ బైక్ వెనుక వస్తున్న ఆటోను కూడా లారీ ఢీకొట్టబోగా డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించ డంతో పెను ప్రమాదం తప్పింది. ఆటోలో ప్రయాణిస్తున్న 8 మందికి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఏఎస్ఐ నాగేశ్వరరావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అంకయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ పరారయ్యాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్ కింద పడి టీటీడీ కార్మికుడి మృతి

తిరుమల, మార్చి9(ఆంధ్రజ్యోతి): తిరుమలలో జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో ఓ కార్మికుడు తీవ్రంగా పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. తిరుపతికి చెందిన యానాదయ్య(59) టీటీడీ అటవీ విభాగంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి. ఆదివారం ట్రాక్టర్‌లో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తూ ఒక్కసారిగా కిందపడ్డారు. టాక్టర్ వెనుక చక్రాలు అతని కాళ్లపై ఎక్కడంతో తీవ్రంగా గాయపడ్డారు. అశ్విని ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం స్విమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ అతడు సాయంత్రం మృతి చెందారు.

రుయాలో గంటపాటు అంధకారం

- ముందే చెప్పి సరఫరా ఆపిన డిస్కం అధికారులు
- జనరేటర్‌ను సిద్ధం చేసుకోవడంలో ఆస్పత్రి వర్గాల వైఫల్యం
- వెంటిలేటర్లపై రోగుల అవస్థలు

తిరుపతి(వైద్యం), మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రుయాలో ఆదివారం ఉదయం గంటపాటు విద్యుత్తు సరఫరాలేక అంధకారం నెలకొంది. కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు ముందే చెప్పినా జనరేటర్‌ను సిద్ధం చేసుకోవడంలో అధికారులు విఫలమవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఆ సమయంలో అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్న.. వెంటిలేటర్లపై ఉన్న రోగులు ఇబ్బంది పడ్డారు. వివరాలిలా ఉన్నాయి. విద్యుత్తు మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 9 గంటలకు సరఫరాను నిలిపేస్తున్నట్లు రుయాస్పత్రిలోని విద్యుత్తు విభాగ సిబ్బందికి శనివారం సమాచారం ఇచ్చారు. ఆ వెంటనే ఆస్పత్రిలో జనరేటర్‌ను సిద్ధం చేసుకోవాల్సిన విద్యుత్తు సిబ్బంది ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. జనరేటర్ మరమ్మతులకు గురైన విషయాన్నీ రుయా అధికారుల దృష్టికి తీసుకెళ్లలేదు. ఆదివారం ఉదయం 9 గంటలకు సరఫరా ఆగడంతో ఆస్పత్రి అంధకారంతో నిండిపోయింది. అరగంట గడిచినా అత్యవసర విభాగం, ఐసీయూ, ఆపరేషన్ థియేటర్ వంటి వార్డుల్లో విద్యుత్తు సరఫరా లేకపోవడంతో రోగుల పరిస్థితి గందరగోళంగా మారింది. ఈ విషయాన్ని వార్డుల్లోని సిబ్బంది రుయా అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో వారు ఆస్పత్రికి చేరుకున్నారు. జనరేటర్ మరమ్మతులకు గురై ఉండటంతో విద్యుత్తు సరఫరా నిలిచిన వెంటనే సరఫరా చేయడానికి వీలు కాలేదని రుయాలోని విద్యుత్తు సిబ్బంది అధికారులకు వివరించారు. విద్యుత్తు సరఫరా నిలిచిపోతుందని ముందుగానే తెలిసినా ఎందుకు జనరేటర్‌ను సిద్ధం చేసుకోలేదని సూపరింటెండెంట్ రవిప్రభు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జనరేటర్ పనిచేయడం లేదనే విషయాన్ని తమ దృష్టికి ఎందుకు తీసుకురాలేదని మండిపడ్డారు. అప్పటికే పలు వార్డులో వెంటిలేటర్లపై ఉన్న రోగుల పరిస్థితి గందరగోళంగా మారడంతో అక్కడి సిబ్బంది, డాక్టర్లు ఆ విషయాన్ని సూపరింటెండెంట్ దృష్టికి తీసుకువచ్చారు. అప్పటికప్పుడే జనరేటర్‌కు మరమ్మతులు చేపట్టి పది గంటలకు సరఫరాను పునరుద్ధరించారు.

ఆ గంటలో ఇద్దరు శిశువుల మృతి!

ఆదివారం ఉదయం 9-10 గంటల మధ్య విద్యుత్తు సరఫరా లేని సమయంలో రుయాలోని చిన్నపిల్లల విభాగంలో వెంటిలేటర్‌పై ఉన్న ఇద్దరు శిశువులు మృతి చెందినట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న అధికారులు చిన్నపిల్లల విభాగానికి చేరుకొని మృతిచెందిన శిశువులను పరిశీలించాక.. మిగతా వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఈ శిశువుల మృతి అనారోగ్యం వల్లే కానీ.. కరెంటు లేక కాదని వైద్యవర్గాలు అంటున్నాయి.

తెలుగుగంగ కాలువలో మృతదేహం

బాలాయపల్లి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కామకూరు సమీపంలోని తెలుగుగంగ కాలువలో గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు ఆదివారం గుర్తించి పోలీసులకు సమాచారం అదించారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి వయస్సు 45 సంవత్సరాలు ఉండవచ్చని, బులుగురంగు చొక్కా, నలుపురంగు ప్యాంటు ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వెంకటగిరి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తిరుచ్చిపై సీతారామలక్ష్మణ సమేత హనుమంతు దర్శనం



చంద్రగిరి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై సీతారామలక్ష్మణ సమేత హనుమంతు ఉత్సవర్లు భక్తులకు దర్శనమిచ్చారు. నిత్యకట్ల కైంకర్యాలు పూర్తయ్యాక పునర్వసు నక్షత్రం సందర్భంగా సాయంత్రం కన్నులపండువగా ఉత్సవర్లకు ఊంజల్ సేవను నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి, తిరుచ్చి వాహనంపై అధిష్ఠింపజేసి మాడవీధుల్లో ఊరేగించారు.

శ్రీవారి సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు. శుక్రవారం హుండీ ఆదాయం రూ.3.52 కోట్లు లభించింది. శనివారం శ్రీవారిని 74,646 మంది దర్శించుకున్నారు.

తిరుమలలో అనధికార వ్యక్తుల విచారణ

తిరుమల, మార్చి9 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు, ఆధారాలు లేకుండా తిరుమలలో తిష్ట వేసిన అనధికార వ్యక్తులను ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నేరాల నియంత్రణ, విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు తిరుమలలో పోలీసులు, విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. 25 మంది ఎలాంటి సర్టిఫికెట్స్ లేకుండా వ్యాపారాలు చేస్తున్నట్టు గుర్తించారు. వారికి నేరచరిత్ర, ఆధారాలు లేకపోవడంతో తిరుపతికి పంపారు.

ఎట్టకేలకు నాయనపాకాల రోడ్డుకు మోక్షం



నంజంపేట - నాయనపాకాల రోడ్డు పనులు

సోమల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం నంజంపేట నుంచి సదుం మండలం నాయనపాకాల వరకు రోడ్డు పనులకు మోక్షం కలిగింది. గత ఐదేళ్లుగా రోడ్డు దుస్థితితో ఈ మార్గంలో ప్రయాణం గగనంగా ఉండేది. కూటమి ప్రభుత్వం తాత్కాలిక రోడ్డు పనులకు రూ. 12లక్షలు నిధులు మంజూరు చేయడంతో నంజంపేట నుంచి నాయనపాకాల వరకు 14 కిలోమీటర్లు గత రోజులుగా తాత్కాలిక పనులు వేగం పుంజుకున్నాయి. ఆదివారం గట్టువారిపల్లె వద్ద రోడ్డు పనులను డీఈ సురేశ్‌బాబు పర్యవేక్షించారు. కమ్మపల్లె, గురికానివారిపల్లె, గాంధీనగర్, మల్లెలవారిపల్లె, ఇర్లపల్లె ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

చురుగ్గా గోకులం షెడ్ల నిర్మాణాలు



చెంచమరెడ్డిగారిపల్లెలో గోకులం షెడ్డు

రొంపిచెర్ల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పశువుల షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం 90 శాతం రాయితీ , గొర్రెలు, మేకలు, కోళ్లకు షెడ్లు నిర్మించుకుంటే 70 శాతం రాయితీ ఇస్తుండటంతో గ్రామాల్లో నిర్మాణాలు చురుగ్గా జరుగుతున్నాయి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరు చేస్తున్నారు. 2019 వరకు టీడీపీ ప్రభుత్వ హయాంలో గోకులం పేరుతో పథకం అమలైంది. వైసీపీ ప్రభుత్వంలో రావడంతో ఈ పథకం మరుగున పడింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రాగానే ఈ పథకం అమల్లోకి వచ్చింది. పశువుల షెడ్ల నిర్మాణానికి రెండు పశువులకు యూనిట్ వ్యయం రూ.1,15,000, నాలుగు పశువులకు రూ .1,85,000, ఆరు పశువులకు రూ.2,30,000, 20 గొర్రెలు, మేకలు షెడ్డు యూనిట్‌కు రూ.1,30,000, 50 గొర్రెలు, మేకలకు రూ.2,30,000, వంద కోళ్ల యూనిట్‌కు రూ.87,000, 200 కోళ్ల యూనిట్ రూ.1,32,000 మేరకు షెడ్లు నిర్మించుకునేందుకు అవకాశాలు కల్పించారు. రొంపిచెర్ల, పులిచెర్ల, సదుం, సోమల పశువైద్యాధికారులు పశువులు ఉన్న వారి జాబితా ప్రకారం ఉన్నతాధికారులు అర్హులను ఎంపిక చేసినట్లు సోమల ఏడీఏ శ్రీనివాసులునాయుడు తెలిపారు. ఉపాధిహామీ పథకంలో పనులు చురుగ్గా చేపడుతున్నారు. ఇప్పటికే కొన్ని షెడ్లు ప్రారంభోత్సవం చేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బైరెడ్డిపల్లెలో ఉచిత కంటి వైద్యపరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బైరెడ్డిపల్లె, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం చెన్నై శంకర్ నేత్రాలయ సహకారంతో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యనిపుణులు 52 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 20 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వైద్యనిపుణులు డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ శ్రీనివాసులు, రమణ, గంగాధరం, చంద్ర, చిన్నప్ప పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



ప్రచారం చేస్తున్న ప్రబోధ సేవా సమితి సభ్యులు

పెద్దపంజాణి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. ఆదివారం పెద్దపంజాణి మండలం శంకర్రాయలపేటలో జీవాత్మ, ఆత్మ, పరమాత్మలపై అవగాహన కల్పించారు. యోగి ప్రబోధానంద యోగ పీఠం స్థాపించిన ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల స్వామి రచించిన 100 ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రచారం చేశారు. కార్యక్రమంలో పలమనేరు, బంగారుపాళ్యం, వి.కోట మండలాల త్రైత సిద్ధాంత సేవాసమితి, హిందూ జ్ఞాన వేదిక అధ్యక్షులు భాస్కర్, బాలాజీ, అశోక్‌కుమార్, సభ్యులు జ్యోతి, వాణిశ్రీ, రెడ్డెమ్మ, హేమంత్, రాజేంద్ర, గౌతంకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కారు దగ్ధం



పుంగనూరు రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వాడకంలోని లేని కారు అగ్ని ప్రమాదంలో కాలిపోయినట్లు అగ్నిమాపకాధికారి సుబ్బరాజు తెలిపారు. ఆదివారం మండలంలోని మేలుందొడ్డి గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి కుమారుడు మహేశ్ ఇంటి సమీపంలో చెత్తకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. వాహనానికి మంటలు అంటుకోవడంతో ఇంటి యజమాని అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది వెళ్లేలోపే వాహనం మంటల్లో కాలిపోయినట్లు అగ్నిమాపకాధికారి తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

తవణంపల్లె, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరగొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో 1985-86లో పదో తరగతి చదువుకొన్న విద్యార్థులు అదే పాఠశాలలో 39 ఏళ్ల తరువాత ఆదివారం కలుసుకొని ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా తమకు విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించుకొని ఆశీస్సులు తీసుకొన్నారు. చదువు అనంతరం ఉద్యోగం, వ్యాపారం, పెళ్లి రీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన విద్యార్థులందరూ కార్యక్రమానికి హాజరై ఆనాటి జ్ఞాపకాలను తలుచుకొంటూ సందడి చేశారు. తమ గుర్తుగా పాఠశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చారు. పూర్వ విద్యార్థులు కేబీ ఉమాపతి, మనోహర్‌రెడ్డి, కుమార్ నాయుడు, కమలావతి, సుకుమార్, జయంతిరెడ్డి, రెడ్డిప్రసాద్, ధర్మేంద్ర, పూర్ణచంద్ర, శ్రీనివాసులతో పాటు విశ్రాంత ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రప్రభపై లక్ష్మీనరసింహుడు



ఆలయంలో ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు

కల్లూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు దేవళంపేటలో కొలువైన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం కనుల పండువగా ధ్వజారోహణ వేడుకలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. ప్రత్యేక వాహనంలో అలంకృతుడైన లక్ష్మీనరసింహస్వామి పురవీధుల్లో విహరించారు. వాహనం ముందు భక్తులు కోలాటాలు, భజనలు నిర్వహించారు. కల్లూరు దేవాంగుల సంఘం ధ్వజారోహణం ఉభయదారులుగా నిర్వహించింది. ఆలయ ప్రధాన అర్చకులు అనంతకుమారాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి స్వామివారు చంద్రప్రభ వాహనంపై పురవీధుల్లో ఊరేగారు. బ్రహ్మోత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

శేషవాహనంపై శ్రీవారి విహారం



ఉత్సవమూర్తుల ఊరేగింపు

సోమల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఆవులపల్లె ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో ఆదివారం ఆలయశుద్ధి అనంతరం మూలవిరాట్‌కు విశేష అలంకరణ చేపట్టారు. ఆవులపల్లె, పెద్దఉప్పరపల్లె, అన్నెమ్మగారిపల్లె, పేటూరు పంచాయతీల్లోని ఆర్యవైశ్య సంఘ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. శేష వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారిని పల్లకిలో అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు కర్పూర నీరాజనాలతో స్వామి వార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. టీటీడీ అధికారులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఘనంగా వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

చౌడేపల్లె, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక బజారువీధిలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం రెండోరోజు విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రధాన కలశాల ఊరేగింపు, ఆరాధన, వాస్తుహోమం, ధాన్యాధివాసం, జలాధివాసం తదితర కార్యక్రమాలు చేపట్టారు. గోపుర కలశ ప్రతిష్ఠ చేపట్టారు.

ముత్యపు పందిరి వాహనంపై వెంకటరమణస్వామి దర్శనం



సింహవాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

పుంగనూరు , మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోనేటి వద్ద వెలసిన కల్యాణ వెంకటరమణస్వామి సింహవాహనంపై పట్టణ పురవీధుల్లో ఊరేగారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పుష్ప పల్లకిలో ప్రత్యేకంగా అలంకరించి మంగళ వాయిద్యాల మధ్య పట్టణంలోని బ్రాహ్మణవీధి, బజారువీధి, తేరువీధి, కుమ్మరవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామి వారికి మంగళహారతులు సమర్పించి మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. సాయంత్రం ముత్యపు పందిరి వాహనంపై స్వామి వారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

కడపనత్తంలో నలగుండ్రాయస్వామి బ్రహ్మోత్సవాలు

బైరెడ్డిపల్లె, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడపనత్తం గ్రామంలో నలగుండ్రాయస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సింహ వాహహంపై స్వామివారు విహరించారు. అలవేలు మంగమ్మ, పద్మావతీ సమేత నలగుండ్రాయ స్వామి ఉత్సవమూర్తులకు ఆలయ అర్చకులు విశేషాలంకరణలు, పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని సింహవాహనంపై కొలువుదీర్చి మేళతాళాలమధ్య ఊరేగించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని హారతులిచ్చారు. ఆలయ ధర్మకర్త మురళీస్వామి, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రహదారులపై ప్రమాదకరంగా పంట నూర్పిళ్లు



పలమనేరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పలమనేరు, గంగవరం, బైరెడ్డిపల్లి మండలాల్లో కొందరు రైతులు పండించిన ఉలవ, రాగి, జొన్న పంటలను రహదారులపై వేసి పంట నూర్పిళ్లు చేస్తున్నారు. రహదారులపై వెళ్లే వాహనాలు ఇలా వేసిన ఉలవ, రాగి, జొన్న పంటలపై వేగంగా దూసుకెళ్లడంతో కొన్నిసార్లు ప్రమాదాలు జరుగుతున్నాయి. పలమనేరు సమీపంలోని రాజుపల్లి రహదారిలో ఇటీవల ఉలవ పంట నూర్పిడి చేస్తుండగా దానిపై వేగంగా దూసుకెళ్లడంతో ఉలవ చెట్లు చక్రాలకు చుట్టుకొని మంటలు రావడంతో కారు పూర్తిగా కాలిపోయింది. అదృష్టవశాత్తు అందులో ప్రయాణిస్తున్న వారు మంటలను గుర్తించి కారు నిలిపి బయటకు పరుగులు తీశారు. ప్రాణాపాయం నుంచి తప్పించుకోగలిగారు. అధికారులు, పోలీసులు స్పందించి రహదారులపై పంట నూర్పిళ్లు చేయకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఉద్యాన పంటలకు పలమనేరు అనుకూలం

ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



రైతు బజార్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటలకు పలమనేరు ప్రాంతం అనుకూలమని.. పలమనేరులో అన్ని సౌకర్యాలతో కూడిన మోడల్ మార్కెట్‌ను త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి అన్నారు. ఆదివారం పలమనేరు వారపు సంత ప్రదేశంలో రూ26 లక్షలతో నిర్మించిన రైతు బజార్‌ను ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యాన పంటల సాగుకు పలమనేరు గుండెలాంటిదన్నారు. పండ్లు, కూరగాయల పంటల సాగుకు ఎంతో అనుకూలమన్నారు. రైతులు పండించిన పంటలను ఆయన పరిశీలించి వారి నుంచి కొనుగోలు చేశారు. రైతులు పండించిన ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లభించాలన్న ఉద్దేశంతో రైతు బజార్లను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతు బజారులో రైతుకు వినియోగదారుడికి మధ్య నేరుగా వ్యాపార లావాదేవీలు ఉంటుందన్నారు. రైతుల సౌకర్యార్థం పలమనేరు సమీపంలోని కేటిల్ ఫారం వద్ద మెరుగైన సౌకర్యాలతో 33 ఎకరాల విస్తీర్ణంలో మోడల్ మార్కెట్ యార్డు ఏర్పాటు కానుందన్నారు. అలాగే ఈ ప్రాంతంలో త్వరలో అందుబాటులోకి రానున్న ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు అనుసంధానంతో పలమనేరు ప్రాంత రైతులు ఎంతో అదృష్టవంతులు కాబోతున్నారని పేర్కొన్నారు. రైతులు పండించిన పంటలను తక్కువ సమయంలో చెన్నై, బెంగళూరు నగరాలకు తరలించి మంచిధరలు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. మరోవైపు రామకుప్పం సమీపంలో కార్గో విమాన సేవలు సైతం అందుబాటులోకి రానున్నాయని.. దీంతో వ్యవసాయ ఉత్పత్తులు విదేశాలకు సైతం తరలించే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఎం పరమేశ్వరన్, డీఈ హరినాథరెడ్డి, ఏఈ రాజన్న, కార్యదర్శి సంజీవకుమార్, పలమనేరు కో ఆపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్వీ బాలాజీ, మాజీ ఏఎంసీ ఛైర్మన్ రామచంద్రనాయుడు, టీడీపీ నాయకులు ఆర్బీసీ కుట్టి, గిరిబాబు, సుబ్రహ్మణ్యం గౌడు, ఖాజాపీర్, బ్రహ్మయ్య, కిరణ్, కోటి, అమరనాథరెడ్డి, కిశోర్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బాలో బోరు ప్రారంభం



బైరెడ్డిపల్లె, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మనపల్లె కస్తూర్బా పాఠశాలలో ఆదివారం తాగునీటి బోరు మోటారును పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్ గౌడు, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యంశెట్టి, పాఠశాల ఎస్వో స్వరూప, పలువురు టీడీపీ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్



ఎన్టీఆర్ సుజల సురక్షిత తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల

కుప్పం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కుప్పం మున్సిపాలిటీతో పాటు మొత్తం నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి నివారణకు తగు చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. కుప్పం పురపాలక సంఘం కొత్తపేటలో 13, 14, 15 వార్డులకు సంబంధించిన ఎన్టీఆర్ సుజల్ డిస్పెన్సింగ్ యూనిట్‌ను టీడీపీ కొత్తపేట ఇన్‌ఛార్జి ముఖేశ్ అలియాస్ అప్పు, కొత్తపేటలోని ఇతర నాయకులతో కలిసి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తెచ్చారు. గతేడాది ఈ డిస్పెన్సింగ్ యూనిట్ మూతపడి ఉండటంతో మూడు వార్డుల ప్రజలు తాగునీటికి పడిన ఇబ్బందులను గమనించి ఆయన స్వయంగా ముందుకొచ్చి పనులు చేశారు. ఎన్టీఆర్ సుజల డిస్పెన్సింగ్ యూనిట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్సీ కంచర్ల మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం నియోజకవర్గానికి త్వరలోనే హంద్రీ-నీవాతో సాగునీరు అందించడానికి అవసరమైన లైనింగ్ పనులు చేయిస్తున్నారని చెప్పారు. అలాగే శాశ్వత తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటారని హామీ ఇచ్చారు. ముందుగా ఎన్టీఆర్ సుజల సురక్షిత తాగునీటి పథకాన్ని పునరుద్ధరించి ప్రజలకు శుద్ధజలం అందిస్తామని తెలిపారు. తాగునీటి పరిష్కారం కోసం ఎన్టీఆర్ సుజల డిస్పెన్సింగ్ యూనిట్‌ను పునరుద్ధరించినందుకు స్థానిక ప్రజలు ఎమ్మెల్సీతోపాటు టీడీపీ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ కుప్పం మున్సిపల్ ఇన్‌చార్జి రాజ్‌కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జి సత్యేంద్ర శేఖర్, బూత్ ఇన్‌చార్జిలు, వార్డు ఇన్‌చార్జిలు, టీడీపీ నాయకులు గోపీనాథ్, మంజునాథ్, శివశంకర్, జయమ్మ, సుకుమారి, మహేంద్ర, వాసు, మురళి, లోకేశ్, స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

గాండ్లకుల మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి



పలమనేరులో సన్మానం పొందిన గాండ్ల కుల మహిళలు, ప్రముఖులు

పలమనేరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గాండ్ల కులస్తులు, మహిళలు ఐక్యతతో అన్ని రంగాల్లో ముందుకు సాగాలని అఖిల గాండ్ల తెలికుల ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు వాకాటి హరికృష్ణ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని చిత్తూరు జిల్లా కమిటీ తరపున పలమనేరు ఎన్జీవో హోంలో గాండ్ల మహిళా ఉద్యోగులు, ఉపాధ్యాయులతోపాటు వివిధ రంగాల్లో ముందుకెళుతున్న వారిని సన్మానించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి ఎన్.హేమావతి మాట్లాడుతూ గాండ్ల కులస్తుల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గిరి శ్రీనివాస్ మాట్లాడుతూ గాండ్ల మహిళలు ఇప్పటికి వెనుకబాటు తనంలో ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్ర కోశాధికారి ఆర్కాట్ హేమాద్రి మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా కమిటీలు ఏర్పాటు చేసుకొని ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. జిల్లా గౌరవాధ్యక్షులు అమరేంద్రబాబు, జిల్లా మహిళా విభాగం కన్వీనర్ డాక్టర్ పి.కుమారి మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఏర్పడిన విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో వి.కోట మాజీ జడ్పీటీసీ చౌడప్ప, అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి టీకే. షణ్ముఖం, జిల్లా అధ్యక్షులు ఏఆర్ కుమార్, కోశాధికారి బాలసుబ్రహ్మణ్యం, మున్సిపల్ కౌన్సిలర్ కోదండరామయ్య, ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతులు శ్రీధర్‌బాబు , ఆర్.రమ, ఉపాధ్యాయులు జె.సరళ, ఆర్.రమ, పి.ఉషారాణి, జి.వి.లక్ష్మి, మోహనకుమారి, డాక్టర్లు పి.కుమారి, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మైలేరు పండుగ

- గిత్తలను నిలువరించడానికి పోటీ పడ్డ యువకులు



గిత్తలను నిలువరిస్తున్న యువకులు

బంగారుపాళ్యం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముంగరమడుగు గ్రామంలో నిర్వహించిన మైలేరు పండుగ ఆదివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ఘనంగా జరిగింది. తొలుత సంప్రదాయం ప్రకారం దేవరెద్దులకు పూజలు నిర్వహించారు. ఈ పోటీలకు సరిహద్దు రాష్ట్రాలైన తమిళనాడు, కర్నాటకతో పాటు పరిసర మండలాల నుంచి పెద్ద ఎత్తున యజమానులు తమ గిత్తలను అందంగా అలంకరించి తీసుకొచ్చారు. రంకెలేస్తూ పరుగులు పెడుతున్న గిత్తలకు కట్టిన పలకలను చేజిక్కించుకోవడానికి యువకులు పోటీ పడ్డారు. చూడడానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ మైలేరు పండుగలో పాల్గొని ప్రజలకు అభివాదం చేస్తూ యువకులను ఉత్సాహపరిచారు. పండుగ ప్రశాంతంగా ముగిసింది. గెలుపొందిన ఎద్దులకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ధరణీప్రసాద్ నాయుడు, జనార్ధన్‌గౌడ్, కోకా ప్రకాష్ నాయుడు, ఎస్పీ పృథ్వీ, ఈశ్వర్ కళ్యాణ్ అభయ ట్రస్టు సభ్యులు లోకనాథ నాయుడు, సుకుమార్ చౌదరి, హేమచంద్ర నాయుడు, మాజీ సర్పంచ్ మణి పాల్గొన్నారు.

గో సంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష విరాళం

ఐరాల(కాణిపాకం), మార్చి 9(ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోసంరక్షణ ట్రస్టుకు తిరుమలగారిపల్లెకు చెందిన మేదరమిట్ల మోహన్ నాయుడు కుమార్తెలు సాత్విక, జాహ్నవి చౌదరి ఆదివారం రూ.1,01,116లను చెక్కు రూపంలో విరాళంగా అందించారు. విరాళదాతకు సూపరింటెండెంట్ కోదండపాణి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రాయితీ వ్యవసాయ పనిముట్లు

పుంగనూరు రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సబ్సిడీలతో వ్యవసాయ పనిముట్లు ఇవ్వనున్నట్లు ఏడీఏ శివకుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాల్లోని రైతులు వ్యవసాయ పనిముట్లకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ మహిళలు, చిన్న, సన్నకారు రైతులు అర్హులన్నారు. గత ఐదేళ్లలో ప్రభుత్వం నుంచి సబ్సిడీలో వ్యవసాయ పనిముట్లు ఉపయోగించుకోని రైతులకు మాత్రమే అవకాశం అన్నారు. ఈ-పంటలో నమోదు చేసి పట్టాదారు పాస్‌పుస్తకం కలిగి ఉండాలన్నారు. కుటుంబంలో ఒకరికి మాత్రమే అవకాశమని, ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉన్న రైతులకు 50 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు గ్రామ రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని ఆయన కోరారు.

నిరుపయోగంగా నీటిశుద్ధి యంత్రం



సోమల శివాలయం వద్ద నిరుపయోగంగా వాటర్ ప్లాంట్

సోమల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సోమల శివాలయం వద్ద గత కొన్ని నెలలుగా నీటి శుద్ధి యంత్రం మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో శుద్ధి నీరు అందక పరిసర ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సోమల నడిబొడ్డున ఉన్న శుద్ధి నీటి కేంద్రం తరచూ మరమ్మతులకు గురికావడంతో ప్రైవేటు వ్యక్తుల నుంచి 20 లీటర్ల నీటిని రూ.15లకు కొనుగోలు చేస్తున్నారు. పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఈ నీటి శుద్ధి కేంద్రం అందుబాటులో ఉండేది. ద్విచక్రవాహనాలు ఉన్న వ్యక్తులు మాత్రమే సోమల జయంతి కాలనీ, తహసీల్దార్ కార్యాలయాల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారు. అధికారులు స్పందించి నిరుపయోగంగా మారుతున్న వాటర్ ప్లాంట్లకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

బాలుర వసతి గృహానికి ప్రహరీ నిర్మాణం



బాలుర వసతి గృహంలో జరుగుతున్న ప్రహరీ నిర్మాణ పనులు

రొంపిచెర్ల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వసతి గృహం ప్రహరీ నిర్మాణ పనులు ఎట్టకేలకు కొనసాగుతున్నాయి గోడలు కూలి రెండేళ్లయినా వసతిగృహంలోకి పశువులు, విషపురుగులు వచ్చేవి. ఇతరులు సైతం వసతి గృహంలో ప్రవేశించేవారు. జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ దృష్టికి సమస్య తీసుకెళ్లగా రూ.6 లక్షలు మంజూరు చేయడంతో పనులు చురుగ్గా జరుగుతున్నాయి.

13న రొంపిచెర్ల వారపుసంత వేలం

రొంపిచెర్ల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మేజర్ పంచాయతీ కార్యాలయంలో ఈనెల 13న గురువారం ఉదయం 11 గంటలకు వారపు సంత వేలం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ ఆర్.ఇబ్రహీంఖాన్ తెలిపారు. వారపుసంతకు రూ.2 లక్షలు, దినసరి మార్కెట్‌కు రూ.80 వేలు, ప్రైవేటు బస్టాండ్ కు రూ.80 వేలు ఒక్కరోజు ముందుగానే రొంపిచెర్ల పంచాయతీ కార్యదర్శికి అందించాలన్నారు. వేలంలో పాల్గొనే వారు పంచాయతీకి ఎలాంటి బకాయిలు లేకుండా ఉండాలని తెలిపారు.

ముంగరమడుగులో ఘనంగా మైలేరు పండుగ

● గిత్తలను నిలువరించడానికి పోటీ పడ్డ యువకులు



గిత్తలను నిలువరిస్తున్న యువకులు - (ఇన్‌సెట్‌లో) ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

బంగారుపాళ్యం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముంగరమడుగు గ్రామంలో నిర్వహించిన మైలేరు పండుగ ఆదివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ఘనంగా జరిగింది. తొలుత సంప్రదాయం ప్రకారం దేవరెద్దులకు పూజలు నిర్వహించారు. ఈ పోటీలకు సరిహద్దు రాష్ట్రాలైన తమిళనాడు, కర్నాటకతో పాటు పరిసర మండలాల నుంచి పెద్ద ఎత్తున యజమానులు తమ గిత్తలను అందంగా అలంకరించి తీసుకొచ్చారు. రంకెలేస్తూ పరుగులు పెడుతున్న గిత్తలకు కట్టిన పలకలను చేజిక్కించుకోవడానికి యువకులు పోటీ పడ్డారు. చూడడానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ మైలేరు పండుగలో పాల్గొని ప్రజలకు అభివాదం చేస్తూ యువకులను ఉత్సాహపరిచారు. పండుగ ప్రశాంతంగా ముగిసింది. గెలుపొందిన ఎద్దులకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ధరణీప్రసాద్ నాయుడు, జనార్ధన్‌గౌడ్, కోకా ప్రకాష్ నాయుడు, ఎన్‌పీ పృథ్వీ, ఈశ్వర్ కళ్యాణ్ అభయ ట్రస్టు సభ్యులు లోకనాథ నాయుడు, సుకుమార్ చౌదరి, హేమచంద్ర నాయుడు, మాజీ సర్పంచ్ మణి, సతీష్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి సమస్య రానీయొద్దు

● ఎమ్మెల్యే భానుప్రకాష్



అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నగరి నియోజకవర్గ పరిధిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పుత్తూరు, నగరి మున్సిపల్ అధికారులకు, నగరి, విజయపురం ఎంపీడీవోలకు సూచించారు. ఆదివారం తిరుపతిలోని తన స్వగృహంలో ఆయన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా తాగునీటి ఎద్దడి తలెత్తితే వెంటనే తన దృష్టికి తీసుకువస్తే సమస్య పరిష్కారానికి అవసరమైన నిధులు మంజూరు చేయిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

నగరి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నగరి మండలం, పట్టణ పరిధిలోని బాధిత కుటుంబాలను ఆదివారం ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పరామర్శించారు. బడుగుపేటలో ఇటీవల మృతి చెందిన టీడీపీ నాయకురాలు పగడాల పార్వతమ్మ కర్మక్రియల్లో పాల్గొని ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. నగరి మున్సిపాలిటీ మూడవ వార్డులో మృతి చెందిన శేఖర్ కర్మక్రియల్లో పాల్గొని ఆయన కుటుంబీకులను పరామర్శించారు. కార్యక్రమంలో నగరి మండల అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, కార్యదర్శి పురుషోత్తం నాయుడు, రాష్ట్ర కార్యదర్శి బాలాజీ, రాష్ట్ర టీడీపీ మహిళా అధికార ప్రతినిధి మీరా తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రిలో స్వల్ప అగ్ని ప్రమాదం

చిత్తూరు సిటీ, మార్చి 9(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ కార్యాలయం ఎదురుగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రిలో స్వల్ప అగ్ని ప్రమాదం జరిగింది. ఆస్పత్రి వర్గాల సమాచారం ప్రకారం.. ఆదివారం సాయంత్రం స్వామివారి చిత్రపటాలకు పూజలుచేసిన అనంతరం దీపాన్ని వెలిగించారు. దీప స్తంభంలోని దీపం వెలుగుతూ కింద పడిపోవడంతో కింద ఉన్న కార్పెట్లు, పర్నీచర్లు అంటుకున్నాయి. ఉన్నట్లుండి మంటలతో కూడిన పొగ కమ్ముకోవడంతో అగ్నిమాపక సిబ్బంది సకాలంలో వచ్చి ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో పెద్దనష్టం జరగలేదని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

తవణంపల్లె, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరగొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో 1985-86లో పదో తరగతి చదువుకొన్న విద్యార్థులు అదే పాఠశాలలో 39 ఏళ్ల తరువాత ఆదివారం కలుసుకొని ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా తమకు విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించుకొని ఆశీస్సులు తీసుకొన్నారు. చదువు అనంతరం ఉద్యోగం, వ్యాపారం, పెళ్లి రీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన విద్యార్థులందరూ కార్యక్రమానికి హాజరై ఆనాటి జ్ఞాపకాలను తలుచుకొంటూ సందడి చేశారు. తమ గుర్తుగా పాఠశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చారు. పూర్వ విద్యార్థులు కేబీ ఉమాపతి, మనోహర్‌రెడ్డి, కుమార్ నాయుడు, కమలావతి, సుకుమార్, జయంతిరెడ్డి, రెడ్డిప్రసాద్, ధర్మేంద్ర, పూర్ణచంద్ర, శ్రీనివాసులతో పాటు విశ్రాంత ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

చిత్తూరు రూరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలంలోని బీఎన్‌ఆర్ పేట ప్రభుత్వ పాఠశాలలో జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్, తిరుపతి అరవింద్ ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటివైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని ఫౌండేషన్ డైరెక్టర్ చెన్నకేశవులు నాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు సీఆర్ రాజన్ ప్రారంభించారు. మండల నలుమూలల నుంచి సుమారు 170 మంది పాల్గొని కళ్ల పరీక్ష చేయించుకున్నారు. అవసరమైన వారిని ఎంపిక చేసి ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు చెన్నకేశవులు నాయుడు తెలిపారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. టీడీపీ సీనియర్ నాయకులు చంద్రప్రకాష్, జిల్లా కార్యదర్శి జయచంద్ర నాయుడు, సురేంద్రకుమార్, కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, మండలాధ్యక్షుడు శశికర్‌బాబు, కార్యదర్శి రఘు, నాయకులు మేషాక్, దేవరాజులు నాయుడు, నీలకంఠ నాయుడు, కుమార్, శ్రీను, ప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా మహా కుంభాభిషేక వేడుకలు



భీమనేని చిట్టిబాబును సన్మానిస్తున్న గ్రామస్థులు

పాలసముద్రం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని బలిజకండ్రిగలో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో ఆదివారం మహాకుంభాబిషేకం వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో గోపూజ, పంచ పాడవులు, అమ్మవారికి మహాయాగం, రుద్రాభిషేకం నిర్వహించిన అనంతరం యాగశాల నుంచి కలశాలను తీసుకువచ్చి కుంభాభిషేకం వేడుకలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబునాయుడిని ఆలయ ధర్మకర్త మురళి, గ్రామస్థులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల వాసులతో పాటు, తమిళనాడు వాసులు ఎక్కువగా పాల్గొన్నారు.

గో సంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష విరాళం



చెక్కును విరాళంగా అందిస్తున్న దాత

ఐరాల(కాణిపాకం), మార్చి 9(ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోసంరక్షణ ట్రస్టుకు తిరుమలగారిపల్లెకు చెందిన మేదరమిట్ల మోహన్ నాయుడు కుమార్తెలు సాత్విక, జాహ్నవి చౌదరి ఆదివారం రూ.1,01,116లను చెక్కు రూపంలో విరాళంగా అందించారు. విరాళదాతకు సూపరింటెండెంట్ కోదండపాణి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

చిత్తూరు అర్బన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మహిళలతో వ్యభిచారం చేయిస్తున్న ముగ్గురు వ్యక్తులపై ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. స్థానిక పాత బస్టాండ్ సమీపంలో ఉన్న ఓ లాడ్జిలో ముగ్గురు మహిళల చేత వ్యభిచారం చేయిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దాంతో ఆదివారం రాత్రి పోలీసులు లాడ్జిపై దాడి చేశారు. ఈ దాడిలో వ్యభిచారం చేయిస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

పెనుమూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కత్తిరెడ్డిపల్లిలో జరిగిన ఘర్షణలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ మధు తెలిపారు. ఆయన వివరాల మేరకు కత్తిరెడ్డిపల్లి గ్రామస్తుడు దివకర్‌కు అదే గ్రామానికి చెందిన లక్ష్మమ్మ, ఆమె కుమారుడు కరుణాకర్‌కు పాత కక్షలు ఉన్నాయని చెప్పారు. ఈ క్రమంలోనే ఘర్షణపడి ఫిర్యాదులు చేసుకున్నారని, దీంతో ఇరువర్గాలపై కేసు నమోదు చేశామన్నారు.

జల్లికట్టుకు అనుమతులు లేవు



బొంతివంకలో పోలీసుల గస్తీ

పెనుమూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలో జల్లికట్టు వంటి కార్యక్రమాలకు అనుమతులు లేవని పోలీసులు హెచ్చరించిన విషయం విధితమే. అయితే బొంతివంకలో జల్లికట్టు నిర్వహిస్తారని పోలీసులకు సమాచారం రావడంతో ఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం ఆ గ్రామంలో పోలీసులు గస్తీ నిర్వహించారు. పోలీసుల అనుమతులు లేనిదే ఎలాంటి కార్యక్రమాలు చేయరాదని సీఐ శ్రీనివాసరావు సూచించారు.

అంబేడ్కర్ జయంతిని విజయవంతం చేద్దాం

పూతలపట్టు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): దళితులంతా ఐకమత్యంగా ఉంటూ అంబేడ్కర్ జయంతిని విజయవంతం చేద్దామని పలువురు దళితనేతలు కోరారు. పూతలపట్టు అంబేడ్కర్ భవనంలో ఆదివారం అంబేడ్కర్ జయంతి కార్యక్రమంపై సమీక్షా సమావేశం జరిగింది. దళిత నాయకులు షణ్ముగం, జీవరత్నం, డాక్టర్ మునిరత్నం, రాజేంద్ర, నాగరాజు, దామోదర్, మంజు, అర్జున్, దాము, హరి, దూర్వాసులు, రవీంద్రన్ పాల్గొన్నారు.

213 మందికి వైద్య పరీక్షలు

గంగాధరనెల్లూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): బెంగళూరు వైదేహి ఆసుపత్రి ఆధ్వర్యంలో గంగాధరనెల్లూరు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఆదివారం నిర్వహించిన మెడికల్ క్యాంప్‌లో 213 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైదేహి ఆస్పత్రి డాక్టర్లు గుండె, కిడ్నీ, కళ్లు, ఎముకలు, దంతాలతో పాటు వివిధ రకాల వ్యాధులకు సంబంధించి రోగులకు వైద్యపరీక్షలు చేశారు. అనంతరం రోగులకు మందులు, మాత్రలు ఉచితంగా పంపిణీ చేశారు.

నేడు గంగాధరనెల్లూరుకు చింతా మోహన్ రాక

గంగాధరనెల్లూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు మండల కేంద్రానికి సోమవారం ఉదయం 10 గంటలకు మాజీ కేంద్రమంత్రి చింతా మోహన్ వస్తున్నారని మండల కాంగ్రెస్ పార్టీ నేతలు పేర్కొన్నారు. ఆయన ప్రజా సమస్యలపై పార్టీ నేతలతో చర్చించి, అనంతరం మీడియాతో మాట్లాడనున్నట్లు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో మాస నారాయణి సేవ

చిత్తూరు కల్చరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో ఆదివారం స్వామి వారికి మాస నారాయణి సేవను భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మందిరంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం స్వామివారి అన్న ప్రసాదాలను నగరంలోని పలు ప్రాంతాల్లో పేదలకు పంపిణీ చేశారు. సత్యసాయి భజన మండలి, బాలవికాస్ సభ్యులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

యాదమరి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): యోగి ప్రబోధానంద యోగ పీఠం స్థాపించిన ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర రచించిన ఆధ్యాత్మిక రచనలను త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో వరదరాజులపల్లిలో ఆదివారం ఇంటింటా ప్రచారం చేశారు. ఫాల్గుణ మాసం, హోలీ పౌర్ణమి పండుగ సందర్భంగా పండుగలపై అవగాహన కల్పించారు. కమిటీ అధ్యక్షుడు ధనుంజయ, మునిరత్నం, సరళాదేవి, విమలమ్మ, నాగమ్మ పాల్గొన్నారు.

మాలల సింహ గర్జనను విజయవంతం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంఎస్ బాబు, దళిత సంఘాల నేతలు

చిత్తూరు అర్బన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను నిలుపుదల చేయాలని కోరుతూ ఈ నెల 23వ తేదీ తిరుపతి మున్సిపల్ మైదానంలో జరగనున్న రాయలసీమ మాలల సింహ గర్జనను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఒక హోటల్‌లో ఏర్పాటు చేసిన మాలల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ మాలల ఐక్యతను చూసి ఓర్చుకోలేని కొంత మంది మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం సింహ గర్జన పోస్టర్లను ఆవిష్కరించారు. దళిత సంఘాల నేతలు యమలా సుదర్శనం, రవి, రాసనపల్లె ప్రకాష్, ప్రభాకర్, పరదేశి, ధనంజయ, దొరైకన్ పాల్గొన్నారు.

నగరి సీఐగా విక్రమ్

నగరి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నగరి అర్బన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విక్రమ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు సీఐగా ఉన్న మహేశ్వర్ బదిలీపై చిత్తూరు మహిళా పోలీసుస్టేషన్‌కు వెళ్లడంతో తిరుపతి ఎస్బీ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న విక్రమ్ ఇక్కడకు వచ్చారు. శాంతి భద్రతలపై ప్రత్యేకదృష్టి సారిస్తానని తెలిపారు.

అసంపూర్తిగా మరుగుదొడ్ల నిర్మాణం

● ఇబ్బందులు పడుతున్న అర్జీదారులు



అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్లు

పాలసముద్రం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండల కార్యాలయాలకు వచ్చే ప్రజలసౌకర్యార్థం మరుగుదొడ్లు ఏర్పాటు చేయడానికి గత ప్రభుత్వంలో నిధులు మంజూరు చేశారు. ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల మధ్యన మరుగుదొడ్లు నిర్మించడానికి గదిని నిర్మించి మోల్డింగ్ వేశారు. కాంట్రాక్టర్‌కు గత ప్రభుత్వంలో సక్రమంగా బిల్లులు రాకపోవడంతో పనిని మధ్యలోనే ఆపివేశారు. మరుగుదొడ్ల సౌకర్యం లేక పోవడంతో కార్యాలయాలకు పనుల నిమిత్తం వచ్చే అర్జీదారులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా ఆలయ గోపురం నిర్మాణానికి భూమిపూజ

గంగాధరనెల్లూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహదేవమంగళం గ్రామ సమీపంలో గల సంతాన వేణుగోపాలస్వామి ఆలయ నూతన గోపురం నిర్మాణానికి గాను ఆదివారం భూమిపూజ వైభవంగా నిర్వహించారు. అర్చకులు ఆలయంముందు భాగంలో స్వామివారి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేసి, అనంతరం వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ గోపురం నిర్మాణానికి భూమిపూజలు చేశారు. ఆలయ నిర్వాహకులతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు, కర్ణాటక వాసులు భారీగా తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు.

ఆ బస్సు సర్వీసులు మళ్లీ వస్తాయా..?

● ఆశల పల్లకిలో వెదురుకుప్పం ప్రజలు

వెదురుకుప్పం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఆ బస్సు సర్వీసులు మళ్లీ తమ రోడ్లవైపు వస్తాయా..? వాటి పునరుద్ధరణ జరగకపోతుందా అన్న ఆశల పల్లకిలో వెదురుకుప్పం ప్రజలు ఉన్నారు. వెదురుకుప్పంకు పుత్తూరు, తిరుపతి ఆర్టీసీ డిపోల నుంచి నడిచిన చాలా సర్వీసులను గతంలో నిలిపివేశారు. దీంతో ఈ మార్గాల్లో వాహన రాకపోకలకు బస్సులు లేక ప్రజలు ఇతర వాహనాలపై ఆధారపడి ప్రయాణాలు కొనసాగిస్తున్నారు.

● పుత్తూరు డిపో నుంచి వెదురుకుప్పం-పెనుమూరు మీదుగా చిత్తూరు వెళ్లే మూడు సర్వీసులు రద్దయ్యాయి. అదేవిధంగా వెదురుకుప్పం మీదుగా మదనపల్లి సర్వీసు, కార్వేటినగరం-పెనుమూరు షటిల్ సర్వీసులు రెండు, కార్వేటినగరం-చంద్రగిరికి వెళ్లే సర్వీసులు రెండు, వెదురుకుప్పం మీదుగా అనుప్పల్లికి వెళ్లే నైట్‌హాల్ట్ సర్వీసు, నచ్చుకూరు సర్వీసు రద్దయ్యాయి. ఇలా పుత్తూరు డిపో నుంచి వెదురుకుప్పం మీదుగా నడిచే చాలా సర్వీసులను రద్దు చేసి ప్రయాణికులకు ఆ బస్సులను దూరం చేశారు.

● తిరుపతి డిపో నుంచి వెదురుకుప్పం మీదుగా పెనుమూరుకు వెళ్లే సర్వీసు ఒకటి, కార్వేటినగరం-చంద్రగిరికి వెళ్లే షటిల్ సర్వీసులు రెండు, చంద్రగిరి మీదుగా వెదురుకుప్పంకు వచ్చే సర్వీసు, వెదురుకుప్పం నైట్ హాల్ట్ సర్వీసు రద్దయ్యాయి.

ఆశల పల్లకిలో ప్రయాణికులు

ఈ బస్సు సర్వీసులను కూటమి ప్రభుత్వంలోనైనా పునరుద్ధరించి తమ కష్టాలు తీరుస్తారన్న ఆశల పల్లకిలో ప్రయాణికులు ఉన్నారు. ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రభుత్వ విప్ థామస్ చొరవ చూపి బస్సు సర్వీసుల పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని వెదురుకుప్పం ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

సకాలంలో సస్య రక్షణతో అధిక దిగుబడి



మామిడి రైతులకు సూచనలు చేస్తున్న మధుసూదనరెడ్డి

తవణంపల్లె, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మామిడి పంటలో సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఉద్యాన శాఖాధికారి మధుసూదనరెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని గాజులపల్లె సమీపంలోని జీసీఆర్ మ్యాంగో ఫ్యాక్టరీలో మామిడి పూత, పిందె దశలో చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలపై మామిడి రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మామిడి పంటలో పిందె దశలో సోకే తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సంవత్సరం సబ్సిడీపై రైతులకు అందించేందుకు వీలుగా 1.90 ఫ్రూట్‌కవర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. మామిడి కాయలు కోడి గుడ్డు సైజులో ఉన్న సమయంలో కవర్లు కట్టడం వలన నాణ్యమైన పంట దిగుబడి సాధించవచ్చునన్నారు. శాస్త్రవేత్తలు సందీప్‌నాయక్, రామయ్య, గుజ్జు పరిశ్రమల సంఘం నాయకులు బాబి, మామిడి రైతులు పాల్గొన్నారు.

నూతన గ్రంథాలయ భవన నిర్మాణానికి భూమి పూజ



శంకుస్థాపనకు భూమి పూజ చేస్తున్న చెన్నకేశవులు నాయుడు

చిత్తూరు రూరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): నగరంలో నూతన గ్రంథాలయ భవన నిర్మాణానికి ఆదివారం చిత్తూరు ఎమ్మెల్యే తండ్రి చెన్నకేశవులు నాయుడు భూమి పూజ నిర్వహించారు. గతంలో ఇక్కడున్న గ్రంథాలయ భవనాన్ని రోడ్డు వైండింగ్ కారణంగా పడగొట్టారు. రోడ్డుకు పోను అదే స్థలంలో రూ.3.10 కోట్లతో భవన నిర్మాణానికి ప్రభుత్వం అనుమతించింది. ఈ క్రమంలో ఆదివారం ఆయన భూమి పూజ చేశారు. జిల్లా గ్రంథాలయ డిప్యూటీ లైబ్రేరియన్ లలిత, మాజీ జడ్పీటీసీ చిట్టిబాబు నాయుడు, సిబ్బంది గుణశేఖర్, సుల్తానా భాను, తులసికుమార్, పూర్ణిమ, సరస్వతి, దేవీబాల, లవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రకళా పోటీలో యాదమరి విద్యార్థినికి ప్రథమస్థానం



ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్ఎస్ ఏపీ కోఆర్డినేటర్

యాదమరి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష, డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ జిల్లాస్థాయి నేషనల్ సైన్స్‌డే కార్యక్రమంలో యాదమరి విద్యార్థిని పూజిత ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. శనివారం చిత్తూరులోని లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో డీఈవో వరలక్ష్మి ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల స్థాయి విద్యార్థులకు పాఠశాలల్లో అందుబాటులో ఉండే వనరుల పొదుపు చేయుట అనే అంశంపై చిత్రలేఖన పోటీ నిర్వహించారు. యాదమరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థిని పూజిత ప్రథమస్థానంలో నిలవడంతో సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ మద్దిపట్ల వెంకటరమణ నాయుడు ప్రశంసాపత్రం అందజేశారు. డీవైఈవో బి.చంద్రశేఖర్, జ్యూరీ సభ్యులు అరుణ్‌కుమార్, మురళిసింగ్, ఆర్ట్‌మాస్టర్ దామోదరాచారి, వినాయక ఆచారి పాల్గొన్నారు.

ఘనంగా మహా కుంభాభిషేకం



ప్రసన్న వినాయకునికి పూజలు

నింద్ర, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నింద్రలోని ప్రసన్న విఘ్నేశ్వర శివ వైష్ణాలయంలో గత మూడు రోజులుగా జరిగిన జీర్ణోద్ధరణ, ఆలయ అష్టబంధన మహాకుంభాభిషేక వేడుకలు ఆదివారంతో వైభవంగా ముగిశాయి. శనివారం శ్రీదుర్గ నింద్రేశ్వర లింగ ప్రతిష్ఠాపన, ఆదివారం ఉదయం మహా సంకల్పం, మహా పూర్ణాహుతి, కలశ ప్రదర్శన, మహా కుంభాభిషేకం మండ పుష్పంతో ముగిసింది. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్, శ్రీశైలం ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ చక్రపాణిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం దేవతామూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

నేత్రపర్వంగా వేణుగోపాలస్వామి కల్యాణం



గుడిపాల, మార్చి 9: మండలంలోని చెరువుముందరవూరులో ఆదివారం వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాన్ని గ్రామపెద్దలు, గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ఉదయం అభిషేకాలు నిర్వహించి గణపతి హోమం, మధ్యాహ్నం కలశారాధన చేశారు. భక్తులకు అన్నదాన చేశారు. మహిళలకు బొందారాలను పంపిణీచేశారు. వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాన్ని పురోహితులు చంద్ర శర్మ, రూపేష్ శర్మ, దాము శర్మ, కేశవ శర్మ సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వసంతాపురం గ్రామానికి చెందిన శ్రీనివాసులు అమ్మవారికి తాళిబొట్టు సమర్పించగా, చెరువుముందరవూరుకు చెందిన మధు, మనోజ్ కుటుంబసభ్యులు పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి పుష్పపల్లకిలో మంగళవాయిద్యాల మధ్య, బాణసంచా వేడుకల మధ్య పురవీధుల్లో ఊరేగించారు.

నేత్ర, దంత వైద్యశిబిరం



సురేంద్రనగరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వెదురుకుప్పం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల అవసరాలను గుర్తించి ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని జిల్లా రిటైర్డ్ ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. ఆదివారం కార్వేటినగరం మండలం సురేంద్రనగరంలో ఆడోప్ట్ ఎ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ - అమెరికా వారి ఆర్థిక సహకారంతో ఆ సంస్థ కన్వీనర్ నిషిధరాజు ఆధ్వర్యంలో ఉచిత కంటి, దంత వైద్య శిబిరం నిర్వహించారు. తిరుపతి ఐ కేర్ హాస్పిటల్, దంత వైద్యులు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హిమజ విద్యా సంస్థల చైర్మన్ ఎం.సురేంద్రరాజు, వెంకట సుబ్బరామరాజు, వైద్యులు హాజరయ్యారు.

నలుగురికి ఉత్తమ అవార్డులు



మెమెంటోలు అందుకున్న హెల్పర్ తనూజ, సూపర్‌వైజర్ అనురాధ, సీడీపీవో వినతశ్రీ, టీచర్ గోవిందమ్మ

గంగాధరనెల్లూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని నలుగురు ఉత్తమ అవార్డులు అందుకున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా చిత్తూరు నగరం నాగయ్య కళాక్షేత్రంలో శనివారం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్ కుమార్ చేతులమీదుగా గంగాధరనెల్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని సీడీపీవో గుండ్లపల్లె వినతశ్రీ, సూపర్‌వైజర్ అనురాధ, అంగన్‌వాడీ టీచర్ గోవిందమ్మ, పెనుమూరు మండలానికి చెందిన అంగన్‌వాడీ హెల్పర్ తనూజ ఉత్తమ ప్రశంసాపత్రాలతో పాటు మెమెంటోలు అందుకున్నారు.

కంటి వైద్య శిబిరం

నగరి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక బాలిక ఉన్నత పాఠశాలలో తిరుపతి శ్రీవెంకటేశ్వర అరవింద నేత్రాలయం వారి సహకారంతో ఈ శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ రవితేజ 150 మందికి పరీక్షలు ఉచితంగా నిర్వహించి, 60 మందికి మందులు పంపిణీ చేశారు. 50 మందికి కంటి అద్దాలు అందించారు. 30 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. గౌరీశంకర్, సీఈవో సీతారామ నాయుడు, సిబ్బంది కృష్ణల్లా, దిలీప్ పాల్గొన్నారు.

ఆశ వర్కర్లకు పని భారాన్ని తగ్గించాలి

నగరి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఆశ వర్కర్లకు పనిభారాన్ని తగ్గించాలని, జీతాలు పెంచాలని ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కోదండయ్య, కార్యదర్శి చందామల్లై డిమాండ్ చేశారు. ఆదివారం నగరి పట్టణంలో ఆశవర్కర్ల నియోజకవర్గ జనరల్‌బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా ఆశ వర్కర్లు గ్రామాల్లో, పట్టణాల్లో మాతా శిశు సంరక్షణతో పాటు ఆరోగ్యానికి సంబంధించి సర్వేలు చేస్తున్నారని చెప్పారు. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న ఆశ వర్కర్లకు ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సుజాత, ఉషారాణి, రూప, సలీన, నగోమి, రేవతి పాల్గొన్నారు.

రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్‌గా జ్ఞానజగదీశ్ నియామకం



చిత్తూరు అర్బన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): వైసీపీ విభాగం రాష్ట్ర మొదలియార్ సంఘ చైర్మన్‌గా జ్ఞానజగదీశ్‌ను ఆ పార్టీ నియమించింది. గతంలో ఈయన మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పనిచేశారు. ఆదివారం చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డిని కలవగా, అభినందనలు తెలిపారు. అలాగే రాష్ట్ర మహిళా విభాగంలో జిల్లాకు చెందిన పలువురికి స్థానం లభించింది. రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా గీతా యాదవ్, జనరల్ సెక్రటరీగా గాయత్రిదేవి, ద్రాక్షాయణి, స్పోక్స్ పర్సన్‌గా శ్రీదేవిరెడ్డి, కార్యదర్శులుగా మేరీ జయరామ్, సరస్వతమ్మ, కల్పలతారెడ్డి, యమున, ధనలక్ష్మిలకు చోటు లభించింది.

హంస వాహనంపై లక్ష్మీనరసింహస్వామి దర్శనం

శ్రీరంగరాజపురం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మంగుంటలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం స్వామివారికి అభిషేకం, కళ్యాణోత్సవం, బలిహరణం, ప్రధాన హోమం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను హంస వాహనంపై ఊరేగించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.